కరపత్రం

SINCE 2014

ఆదివారం సెప్టెంబర్ 20,2026 సంపుటి : 2 సంచిక : 342 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

- మామునూరు విమానాశ్రయం పనులు కీలక దశకు
- భూసేకరణకు రూ.295 కోట్లు కేటాయింపు
- 953 ఎకరాల పరిధిలో ఎయిర్‌పోర్టు అభివృద్ధి
- రన్‌వే, పార్కింగ్, సీవరేజ్ పనులకు ప్రణాళిక
- టెర్మినల్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్ నిర్మాణం
- చివరి ప్యాకేజీకి రూ.213.59 కోట్లు
- నవంబర్ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి లక్ష్యం
- డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు

హైదరాబాద్:
వరంగల్ ఎయిర్ పోర్టు కు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణాలను రూ.213.59 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబరు నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో కొత్త అవకాశాలు

- భారత్ ఇప్పటివరకు 40 ఎఫ్‌టీఏలపై సంతకాలు
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భారత నైపుణ్యాలపై విశ్వాసం
- వ్యాపారులు, రైతులు, మహిళలకు కొత్త అవకాశాలు
- ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్
- టైర్-2, టైర్-3 నగరాల నుంచే సగం స్టార్టప్‌లు
- దేశ అభివృద్ధిలో యువతే కీలకం
- యువతకు సమగ్ర అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం

2లో..

ఇది ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

- సాగునీరు, కరెంట్ కష్టాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి
- కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా వినియోగం తక్కువ
- ఏపీ 71.5%.. తెలంగాణ 28% నీటినే వాడుకుంది
- కల్వకుర్తిలో 5 మోటార్లు ఎందుకు నడపడం లేదు?
- కాంగ్రెస్ వైఫల్యంతోనే పంటలు ఎండిపోయే పరిస్థితి
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై CPWRS 'వెరీ గుడ్' నివేదిక

2లో..

హైదరాబాద్:
సాగునీటి కష్టాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని రేవంత్ సర్కార్ చెబుతోందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కరెంట్ కష్టాలతోనూ తమకెలాంటి సంబంధం లేదని ప్రభుత్వం అంటుంది. ఇవన్నీ ప్రకృతి తెచ్చిన కష్టాలుగా ప్రభుత్వం చెబుతూ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు.

లక్ష స్కూళ్లను మూసేశారు..: రాహుల్ గాంధీ

విద్యార్థులే దేశ భవిష్యత్తు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే.. విద్యార్థులు ప్రశ్నించవద్దని కోరుకునే ఒక 'వ్యవస్థ'.. దేశం మొత్తాన్ని తన గుప్పిట్లోకి తీసుకుందని ఆరోపించారు. ఆ వ్యవస్థను ప్రశ్నిస్తున్న వారిని కొంతమంది గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

2లో..

హైకోర్టు తీర్పుపై ఎస్ఎల్‌పీ దాఖలు

- మధ్యాహ్నం సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం
- ఎస్ఎల్‌పీపై విచారణకు అనుమతి వస్తుందా? ఉత్కంఠ
- విచారణ ఎప్పుడు చేపడతారనేది ఇంకా స్పష్టత లేదు
- ఇప్పటికే ఏలేటి, పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్లు
- ఫిరాయింపు కేసులో హైకోర్టు అనర్హత వేటు
- 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా పరిగణించాలని ఆదేశం

హైదరాబాద్:
హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ ఇవాళ మధ్యాహ్నం సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అనుమతిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సి ఉంది. సర్వోన్నత న్యాయస్థానం ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

2 లో

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి

- దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రండి
- రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం
- కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారు
- నీళ్లు ఇవ్వకపోతే గల్లా పట్టుకుని అడుగుతాం
- తప్పు చేశామని తేలితే చర్యలు తీసుకోండి
- లోవోల్టేజ్, కరెంట్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయంటున్న రైతులు
- నీళ్లు, కరెంట్ ఉన్నా అందించలేని స్థితిలో సర్కార్

2 లో

వనపర్తి జిల్లా:
కాంగ్రెస్ నేతలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని.. దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలన్నారు.

పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని తెచ్చిందే కేసీఆర్: టీపీసీసీ చీఫ్

దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కి చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. "పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని తెచ్చిందే కేసీఆర్. తెదేపాలో గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, కాంగ్రెస్‌లో గెలిచిన సబితను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రులను చేశారు. ప్రభుత్వాలను పడగొట్టి.. పార్టీలను చీల్చిన చరిత్ర భాజపాది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోంది" అని టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యానించారు.

యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

దిల్లీ:
కేంద్రం తీసుకొచ్చిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

2లో..

ఎర్రవల్లి భూముల సర్వేలో మరో మలుపు

ఎర్రవల్లి:
సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి లో భూముల సర్వే మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని 325 సర్వే నెంబరులో 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే, ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు.

మధుయాష్కీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వర్గీయుల మధ్య తోపులాట

హైదరాబాద్:
సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన.. జీవో నం.118 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల జారీ కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మధుయాష్కీ వర్గాల పరస్పర నినాదాలతో ఘర్షణ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ , బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజాహరుద్దీన్ హాజరయ్యారు.

నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ షురూ.. ఇకపై..

నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనక్కి వెళ్లడం ప్రారంభించినట్లు ఐఎండీ ధ్రువీకరించింది. సాధారణంగా సెప్టెంబర్ 17న ఉపసంహరణ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈసారి రెండు రోజులు ఆలస్యమైంది.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం సెప్టెంబర్ 20,2026

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు: మోదీ

మొదటి పేజీ తరువాయి
భారత్ పలు దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.'భారత్ ఇప్పటివరకూ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. వ్యాపారులు, రైతులు, మహిళలు.. ఇలా ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు లభిస్తాయి. ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లు దాదాపు సగం వరకు టైర్-2 టైర్-3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయి. దేశీయ లక్ష్యాల సాధనకు యువతే కీలకం' అని మోదీ అన్నారు. యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

లక్ష స్కూళ్లను మూసేశారు.. రాహుల్ గాంధీ

మొదటి పేజీ తరువాయి
మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో నిర్వహించిన 'ఛాత్రోకీ గూంజ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.
సోషల్ మీడియా సహా అన్నింటినీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నియంత్రిస్తున్నారని, నిఘా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురితో ఆయన మాట్లాడారు. ఎంపీపీఎస్సీలో అక్రమాలను ప్రశ్నిస్తే తమపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని దేవాస్‌కు చెందిన ఓ విద్యార్థి పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నియామక పరీక్షలకు సంబంధించిన 13 శాతం కోటాను నిలిపివేసిన అంశాన్ని పలువురు లేవనెత్తారు.

యూపీఐ పేమెంట్లు స్వీకరించబోం.. నగదు మాత్రమే!

మొదటి పేజీ తరువాయి
తాము యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని, నగదు మాత్రమే తీసుకుంటామని కొందరు వ్యాపారులు బోర్డులు పెడుతున్నారు. ఒకవేళ యూపీఐ పేమెంట్ చేస్తే అదనంగా చెల్లించాలంటున్నారు. దిల్లీ శివారులోని ఘజియాబాద్‌లో ఈ తరహా బోర్డులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.
శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి.. విద్యార్థులకు అజిత్ డోభాల్ పిలుపు
పెద్ద వ్యాపార సంస్థలు, ఇ-కామర్స్ సంస్థలతో (పీ2ఎం) చేసే రూ.2000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి దీనిని అమలు చేయనున్నారు. కాగా, దీనిపై వ్యాపారుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అదనపు ఖర్చును భరించేందుకు వారు ఇష్టపడటం లేదు. ఎండీఆర్ అమల్లోకి వచ్చిన తర్వాత వీలైనంత వరకు నగదునే చెల్లించాలని పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారిని ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

హైకోర్టు తీర్పుపై ఎస్ఎల్‌పీ దాఖలు

మొదటి పేజీ తరువాయి
ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే కేసులో ఇప్పటికే భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేవియట్ దాఖలు చేశారు.

భారాస తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారాస, భాజపాలు దాఖలు చేసిన పిటిషన్‌లను అనుమతించింది. భారాస సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూలు పేరా 2(1)(ఎ) రెడ్‌విత్ 191(2) ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఎర్రవల్లి భూముల సర్వేలో మరో మలుపు

మొదటి పేజీ తరువాయి
388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు 250 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన భూమిలో తమకూ హక్కులు ఉన్నాయని వెంకటాపూర్ వాసులు చెబుతున్నారు. కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

- రైతులకు నోటీసులు ఇస్తున్న అధికారులు
ఎర్రవల్లిలోని సర్వే నెంబరు 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించగా.. ఇవాళ 50మంది రైతులకు జారీ చేశారు. సర్వే నెంబరు 325లో ఈనెల 21 నుంచి 4 విడతల్లో సర్వే కొనసాగనుంది. 21వ తేదీన రైతులు భూమి వద్దకు వచ్చి వివరాలు తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

ఇది ప్రకృతి కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు

మొదటి పేజీ తరువాయి
శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మట్లాడారు. శాసనసభలో ఎలినినో పై చర్చ సందర్భంగా ప్రకృతి తెచ్చిన కరువుగా ప్రభుత్వం చెప్పిందని ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్, రేవంత్ తెచ్చిన కరువని దుయ్యబట్టారు.
హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్ కోసం బాధ్యతగా మాట్లాడుతున్నా నీళ్లు, కరెంట్ ప్రకృతి తెచ్చిన కరువు కాదుకృష్ణా జలాల్లో శ్రీశైలం ప్రాజెక్టు లో 84 టీఎంసీ లు వాడుకుంటే ఆ నీళ్లు ఎక్కడ కల్వకుర్తి ద్వారా ఎత్తింది 8 టీఎంసీ లే మరి 84 టీఎంసీ లు ఎక్కడ ఎత్తారు. కల్వకుర్తి లో ఈ రోజు కూడా 5 మోటార్లలో అన్ని ఎందుకు నడపడం లేదు కాంగ్రెస్ వచ్చిన మూడేళ్లలో అతి తక్కువ నీటి వినియోగం కృష్ణా జలాల్లో ఏపీ 71.5 శాతం వాడితే... తెలంగాణ 28 శాతం మాత్రమే వాడింది అని అ?న్నారు.
కాంగ్రెస్ వైఫల్యం వల్లే రాష్ట్రంలో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రతిపక్షం పై దాడి చెయ్యడం తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా సుందిల్ల, అన్నారం బ్యారేజీలపై వెరీ గుడ్ అని ఎజూఃతీం నివేదిక ఇచ్చింది.మేడిగడ్డ వద్ద ఒక బ్లాక్ మాత్రమే సమస్య మేడిగడ్డ వద్ద 4 ఎవీజ లు నీటి ప్రవాహం ఉంది. కన్నేపల్లి పంప్ హౌస్ ఆన్ చేస్తే నీళ్ళు ఎత్తి పోసుకోవచ్చురిటైర్డ్ ఇంజనీర్లు కూడా నీళ్లు ఎత్తి పోసుకోవచ్చుని లేఖ రాశారని హరీష్ రావు రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తారు.

నైరుతి రుతుపవనాల ఉపసంహారణ ప్రక్రియ షురూ.. ఇకపై..

మొదటి పేజీ తరువాయి
వచ్చే 3-4 రోజుల్లో రాజస్థాన్, పంజాబ్, సౌరాష్ట్ర-కచ్‌లోని మరికొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు మరింతగా వెనక్కి వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ తెలిపింది.

రుతుపవనాలు వాయవ్య భారతదేశం నుంచి నిష్క్రమిస్తున్నప్పటికీ, బంగాళాఖాతంలోని వాతావరణ వ్యవస్థ బలపడటంతో దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నాయి. దీంతో సెప్టెంబర్ 20న దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు, ఉరుములు, బలమైన గాలుల పరిస్థితులను ప్రజలు గమనించాల్సి ఉంటుంది.
దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు అండమాన్-నికోబార్ దీవుల్లో సెప్టెంబర్ 20, ఆదివారం భారీ వర్షాలు, ఉరుములతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. తీర ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్, తెలంగాణతో పాటు అండమాన్-నికోబార్ దీవుల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఈ ప్రాంతాల్లో పిడుగులు, ఉరుములతో కూడిన వర్షంతో పాటు గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పగటిపూట బలమైన ఉపరితల గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు రాజస్థాన్, గంగా పరివాహక పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, కొంకణ్-గోవా, మధ్యప్రదేశ్, ఉత్తర కర్ణాటక, తెలంగాణ, విదర్భ ప్రాంతాల్లో గంటకు 30--40 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన ఉరుములు, పిడుగులు సంభవించే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఉరుములు, పిడుగులు ఉంటాయని అంచనా.
ఇదిలా ఉండగా, ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలపడనుంది. సెప్టెంబర్ 18న అల్పపీడనంగా మారిన ఈ వ్యవస్థ సెప్టెంబర్ 21 నాటికి వాయుగుండంగా, సెప్టెంబర్ 22 నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఇది ఒడిశా-ఆంధ్రప్రదేశ్ తీరంవైపు కదులుతూ సెప్టెంబర్ 23 ప్రాంతంలో ఆ తీరాన్ని చేరే అవకాశం ఉంది. దీని ప్రభావంతో వచ్చే వారం తూర్పు భారతదేశంలోని వర్షపాతంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ సవాల్

మొదటి పేజీ తరువాయి
శనివారం ఆయన వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కరెంటు కోతలతో రైతులు అల్లాడుతున్నారని.. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమంటూ తేల్చి చెప్పారు.

"ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్న కేటీఆర్.. నీళ్లు ఇవ్వకపోతే గల్లా పట్టుకుని అడుగుతామన్నారు. తాము తప్పు చేశామని తేలితే చర్యలు తీసుకోండి.. అక్రమాలు జరిగితే ప్రజలకు చూపించి యాక్షన్ తీసుకోవాలన్నారు. రైతులు విద్యుత్, సాగునీటి కష్టాలు చెప్పుకున్నారు.. ప్రకృతి కావాల్సినన్ని నీళ్ళు ఇచ్చినా రైతులకు సాగునీరు లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

"ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగా వాట్ల సామర్థ్యం ఉండేది. 24 వేల మెగా వాట్లకు విద్యుత్ సామర్థ్యం పెంచినం. అత్యల్పంగా కృష్ణా నీళ్లను తెలంగాణ వాడుకుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముప్పై శాతం కంటే ఎక్కువ నీళ్లు వాడుకున్నాం. పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్ట్‌లుగా మార్చినం. ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. వరద వస్తుందంటే వెంటనే నీళ్లు మళ్లించే వాళ్లం.

..చెక్ డ్యామ్‌లు, చెరువులు నింపి పాలమూరులో నీళ్లు ఇచ్చాం. రెండు సబ్ స్టేషన్‌లకు రైతులతో కలిసి వెళ్ళాం. అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావట్లేదని రైతులు చెప్తున్నారు. లో వోల్టేజ్, తరచూ కట్ చేయడంతో మోటార్లు కాలిపోతున్నాయని అంటున్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోతుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విద్యుత్ కష్టాలు, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెప్తున్నారు. అన్ని ఉన్నప్పటికీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేజ్రీవాల్, ఆయన ఫ్యామిలీకి ఎస్ఐఆర్ నోటీసులు.. ఇదెలా సాధ్యం?

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుటుంబంలోని నలుగురికి ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నోటీసులు జారీ చేసింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నోటీసులు ఇచ్చారు. కేజ్రీవాల్, ఆయన భార్య సునీతా కేజ్రీవాల్, కుమారుడు పుల్కిత్ కేజ్రీవాల్, తల్లిదండ్రులు గోవింద్ రామ్ కేజ్రీవాల్, గీతా దేవి పేర్లు నోటీసుల్లో ఉన్నాయి. కేజ్రీవాల్ న్యూఢిల్లీ-40 అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓటరు. ఢిల్లీ ఎన్నికల సంఘం పత్రాల ప్రకారం, న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని 'పార్ట్-51, కేజీ మార్గ్' పరిధిలో మొత్తం 110 మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయి. వీరిలో కేజ్రీవాల్, ఆయన కుటుంబంలోని మరో ఐదుగురు ఉన్నట్లు ఎన్నికల సంఘం వివరించింది.
ఈ పరిణామంపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రశ్నలు లేవనెత్తింది. "ఈ దేశంలో జరుగుతున్న ప్రతిదీ సుప్రీం లార్డ్‌ను సంతోషపెట్టేందుకేనా? మూడుసార్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్ జీ, ఆయన కుటుంబ సభ్యుల పేర్లు ఢిల్లీ ఓటరు జాబితాలో లేకపోవడం ఎలా సాధ్యం?" అని పార్టీ

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది.
ఇదే సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసు జారీ అయింది. ఆమె వివరాలు, పత్రాలను పరిశీలించిన తర్వాత ఓటరు నమోదు చెల్లుబాటు అయ్యిందని ఎన్నికల సంఘం తెలిపింది. శాలిమార్ బాగ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటరు జాబితాలో ఆమె పేరు నవంబర్ 4న చేర్చనున్నారు.
ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఢిల్లీలో దాదాపు 47.6 లక్షల పేర్లు తొలగించారు. గృహస్థాయి ధ్రువీకరణలో వీటిని గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారినవారు, మరణించినవారు, నకిలీ నమోదులు, ఇతర కారణాలుగా వర్గీకరించారు. సెప్టెంబర్ 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను దాఖలు చేయవచ్చు. సెప్టెంబర్ 16 నాటికి ఓటరు జాబితాలో పేర్ల చేర్పు కోసం 68,043 ఫారం-6 దరఖాస్తులు వచ్చాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో తుది ఓటరు జాబితాను నవంబర్ 4న విడుదల చేయనున్నారు. అంతకుముందు దరఖాస్తులు, అభ్యంతరాలను పరిశీలించి అక్టోబర్ 29 నాటికి పరిష్కరించనున్నారు.

180 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు నోటీసులు

కర్ణాటకలోని చిక్కబళ్లాపుర్ జిల్లాలో 7వ తరగతి విద్యార్థుల ప్రాథమిక అభ్యసన స్థాయిపై నిర్వహించిన పరీక్షల్లో ఆందోళనకర అంశాలు వెలుగుచూశాయి. కొంతమంది విద్యార్థులకు సాధారణ కన్నడ అక్షరాలు రాయడం, కూడికలు, తీసివేతలు చేయడం కూడా కష్టంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో 180 మంది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు.
చిక్కబళ్లాపుర్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది 7వ తరగతి విద్యార్థులు సాధారణ గణిత సమస్యలను పరిష్కరించలేకపోవడం, కన్నడ అక్షరాలను రాయలేకపోవడం ఆయన దృష్టికి వచ్చింది. దీనిపై సెప్టెంబర్ 4న విద్యాశాఖ అధికారులకు లేఖ రాసి చర్యలు

తీసుకోవాలని కోరారు.
ఆ తర్వాత చిక్కబళ్లాపుర్ తాలూకాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో 7వ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని విద్యా సమన్వయకర్తలు, బ్లాక్ రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పరీక్షించారు. ఆశించిన కనీస అభ్యసన స్థాయికి చాలా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి పేర్లతో పాటు గత తరగతుల్లో వారికి బోధించిన ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖకు అందించారు.
సెప్టెంబర్ 15న చిక్కబళ్లాపుర్ బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కార్యాలయం నుంచి ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. విద్యార్థులు ఆశించిన ప్రాథమిక అభ్యసన స్థాయిని ఎందుకు చేరుకోలేకపోయారో వివరణ ఇవ్వాలని అందులో కోరారు. నోటీసు అందుకున్న మూడు రోజుల్లో ఆధారాలతో కూడిన లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాధానాలను పరిశీలించిన తర్వాత నిబంధనల ప్రకారం తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.
ప్రభుత్వం విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, నిర్ణీత సమయంలో అవసరమైన విద్యను అందించడంలో విఫలమైతే ఆ కార్యక్రమాల లక్ష్యాలు దెబ్బతింటాయని విద్యాశాఖ నోటీసులో పేర్కొంది. ఉపాధ్యాయుల వివరణల పరిశీలన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.13 కోట్ల కారులో వచ్చిన 26 ఏళ్ల మహిళా ఎమ్మెల్యే

పట్నా: బిహార్ ఎమ్మెల్యే, ప్రముఖ గాయని మైథిలీ ఠాకూర్ (26) ముంబైలోని ప్రసిద్ధ లాల్‌బాగ్చా రాజా మండపాన్ని సందర్శించారు. గణేశుడిని దర్శించుకున్న ఆమె.. నీలిరంగు రోల్స్ రాయిస్ కలినన్‌లో మండపానికి రావడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె రాకకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.
చౌఫర్ నడిపిస్తున్న ఈ విలాసవంతమైన కారులో వెనుక సీట్లో మైథిలీ ఠాకూర్ కూర్చున్నారు. లాల్‌బాగ్చా రాజా మండపం చుట్టూ భారీగా భక్తులు ఉండటంతో కారు నెమ్మదిగా ముందుకు కదిలింది. ఈ సమయంలో ఆమె అక్కడున్న వారితో మాట్లాడటం, ఫొటోలకు పోజులివ్వడం కనిపించింది. మండపం ప్రధాన ద్వారం వద్దకు చేరుకునే సమయంలో కూడా ఆమె ప్రజలకు చేతులు ఊపుతూ అభివాదం చేశారు.
ఈ రోల్స్ రాయిస్ కారు మైథిలీ ఠాకూర్‌దేనా అనే విషయం స్పష్టంగా తెలియలేదు. వాహన నంబర్ ప్లేట్ ప్రకారం అది ముంబై సమీపంలోని వాషి ఆర్టీఓలో నమోదైన వాహనంగా తెలుస్తోంది.

ఆమెకు సొంతంగా ఈ కారు ఉందా? అద్దెకు తీసుకున్నారా? లేదా ప్రత్యేక ఏర్పాటులో భాగంగా ఆమె కోసం వాహనాన్ని సమకూర్చారా? అనే దానిపై అధికారిక సమాచారం లేదు.
దర్శనం సందర్భంగా మైథిలీ ఠాకూర్ గణేశుడి విగ్రహం ముందు తల వంచి ప్రార్థనలు చేశారు. అనంతరం లాల్‌బాగ్చా రాజా సార్వజనిక గణేశోత్సవ మండల్ ప్రతినిధులు ఆమెను సత్కరించారు. మండపానికి వచ్చిన సమయంలో అభిమానులు ఆమెతో ఫొటోలు దిగారు.
మైథిలీ ఠాకూర్ వచ్చిన రోల్స్ రాయిస్ కలినన్ ప్రపంచంలోని ఖరీదైన విలాసవంతమైన ఎస్‌యూవీల్లో ఒకటిగా పేరుంది. దీని ఎక్స్‌షోరూమ్ ధర సుమారు రూ.10.50 కోట్లుగా ఉంది. ముంబైలో పన్నులు, బీమా, ఇతర ఛార్జీలు, వేరియంట్‌ను బట్టి ఆన్‌రోడ్ ధర సుమారు రూ.13.11 కోట్ల నుంచి రూ.15.30 కోట్ల వరకు ఉండొచ్చు. ఇందులో కలినన్ సిరీస్ 2, బ్లాక్ బ్యాడ్జ్ సిరీస్ 2 వేరియంట్లు ఉన్నాయి.
లాల్‌బాగ్చా రాజా దర్శనానికి ఒక రోజు ముందు మైథిలీ ఠాకూర్ ముంబైలోని అంబానీ కుటుంబ నివాసం యాంటీలియాలో జరిగిన గణేశ్ చతుర్థి వేడుకలకు కూడా హాజరయ్యారు. అక్కడ ఈషా అంబానీ ఆమె గానాన్ని ప్రశంసిస్తూ, తమ పిల్లలు ఆమె పాటలను తరచూ వింటారని చెప్పినట్లు మైథిలీ షేర్ చేసిన వీడియోలో కనిపించింది. మైథిలీ ఠాకూర్ లాల్‌బాగ్చా రాజా దర్శనం, ఆమె విలాసవంతమైన కారులో వచ్చిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా కొనసాగుతున్నాయి.

లారీ అసోసియేషన్ స్థాపించిన విఙ్ఞేశ్వర స్వామి మండపం ఆవరణలో మడికొండ రవీందర్ రావు ఆధ్వర్యంలో మహా అన్నదానం

- భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు.. భారీగా తరలివచ్చిన భక్తులు
- లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

కరపత్రం ప్రతినిది, జమ్మికుంట, సెప్టెంబర్ 19: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో జమ్మికుంట లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ విఙ్ఞేశ్వర స్వామి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు, లారీ యజమానులు, డ్రైవర్లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు, ప్రజలకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ మహా అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లారీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజమౌళి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ముక్క జితేందర్, మాజీ కౌన్సిలర్ జుగురు సదానందం తదితరులు పాల్గొన్నారు.అలాగే హుజురాబాద్, చింతలపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులు ప్రత్యేకంగా హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. లారీ రంగానికి చెందిన యజమానులు, డ్రైవర్లు, కార్మికులు ఒకే వేదికపై పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మారేపల్లి రామస్వామి, ఉపాధ్యక్షులు వజ్జపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మారేపల్లి దేవేందర్, అన్నదాన నిర్వాహకులు మడికొండ రవీందర్ రావు కార్యవర్గ సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. లారీ ఓనర్స్, డ్రైవర్లు, సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు.లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహా అన్నదానం నిర్వహించడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అన్నదానం గొప్ప సేవా కార్యక్రమమని, భక్తులకు అన్నప్రసాదం అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.మహా అన్నదాన కార్యక్రమానికి పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలు, యువత, వృద్ధులు, లారీ యజమానులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగింది.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడంతో లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం సభ్యులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, లారీ యజమానులు, డ్రైవర్లు, సంఘం ప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో మహా అన్నదానం

- మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

కరపత్రం ప్రతినిది, జమ్మికుంట, సెప్టెంబర్ 19: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుడి సన్నిధిలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులకు నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని వడ్డించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. గణేష్ మండపం వద్ద భక్తులతో సందడి నెలకొనగా, స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడి ఆశీస్సులు పొందారు.అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నప్పటికీ కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు నిర్వాహకులను అభినందించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజమౌళి మాట్లాడుతూ గణపతి నవరాత్రులను పురస్కరించుకుని భక్తులు, ప్రజల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో జమ్మికుంట పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజలను ఒకచోట చేర్చి భక్తి భావంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమంలో మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి. రాజమౌళి, బచ్చు తిరుపతి, వోల్లాల మల్లన్న, ముక్క జితేందర్, జుగురు సదానందం, దిండిగాల మల్లయ్య, యాద సతీష్, పుల్లూరి శ్రీనివాస్, వై. సంపత్, ఎల్. మధు తదితర అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలోని కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బందిని సంస్థలో విలీనం చేయాలి
- క్రమబద్ధీకరణ ఇతర న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి
- విద్యుత్ శాఖ పల్నాడు జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ డాక్టర్ పి. విజయ్ కుమార్ కు వినతి పత్రం

కరపత్రం ప్రతినిది నరసరావుపేట, సెప్టెంబర్ 19 : ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ జేఏసీ పల్నాడు జిల్లా కమిటీ జనరల్ సెక్రెటరీ ఎస్కే. భాష ఆధ్వర్యంలో శనివారం జొన్నలగడ్డ లోని విద్యుత్ భవన్ లో పల్నాడు జిల్లా సూపరింటెంట్ ఇంజనీర్ డా " పి. విజయ్ కుమార్ ని కలసి రాష్ట్ర కార్యాచరణ లో భాగంగా కార్మికుల సమస్య ల పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధి గా పాల్గొన్న సీపీడీసీయల్ జేఏసీ కమిటీ వైస్ చైర్మన్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని సంస్థ లో విలీనం చేసుకొని, రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద భీమా కోటి రూపాయలు ఇవ్వాలని, కొత్త,పాత అనే భేదం లేకుండా షిఫ్ట్ ఆపరేటర్స్ కు అందరికి సమాన వేతనం ఇవ్వాలని మేనేజ్మెంట్ ని డిమాండ్ చేసారు. కన్వీనర్ కే. ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో పల్నాడు జిల్లా లోని అన్ని సెక్షన్ ల ఏఈ లకు, ఈఈ లకు వినతిపత్రం లు ఇవ్వాలని, వచ్చే నెల అక్టోబర్ లో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం ఇచ్చి వారి ద్వారా ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని కోరుట, నవంబర్ నెలలో అరసవెల్లి నుండి తిరుపతి కి బస్సు యాత్ర, అన్ని కంపెనీలలో ధర్నాలు ఉంటాయి అని, ఫిబ్రవరి 13న ఛలో విజయవాడ ఉంటుంది అని ఈ కార్యక్రమం లో జిల్లా లోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బాజీ, మీరా హుస్సేన్, శివ రామకృష్ణ, కిషోర్, రాజు, కిషోర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో న్యాయ, పోలీస్ అవగాహన కార్యక్రమం

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: అడిషనల్ జడ్జి వీణ ప్రణతి

కరపత్రం ప్రతినిది, జమ్మికుంట, సెప్టెంబర్ 19: హుజూరాబాద్ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను హుజూరాబాద్ సెకండ్ అడిషనల్ జడ్జి కె. వీణ ప్రణతి జమ్మికుంట ఎస్ఐ సంజీవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకున్న వారికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల ఇందిర, గంద్రపల్లి గ్రామ సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్, ఉపసర్పంచ్ బీరేందర్ మ్యాక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అడిషనల్ జడ్జి కె. వీణ పరిణతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చదువుపై పూర్తి దృష్టి సారించి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రతి విద్యార్థి తనకు నచ్చిన రంగంలో లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తమ తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

112 సేవలపై ఎస్ఐ అవగాహన

జమ్మికుంట ఎస్ఐ సంజీవ్ విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని వివరించారు.అలాగే మహిళలు, బాలికల భద్రత కోసం అందుబాటులో ఉన్న షీ టీమ్స్ సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు చట్టాలను తెలుసుకోవడంతో పాటు తమ చుట్టూ ఉన్న వారిలో కూడా అవగాహన కల్పించాలని కోరారు.

తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలి

ఈ సందర్భంగా గంద్రపల్లి గ్రామ సర్పంచ్ తోట కవిత లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివిస్తున్నారని, గురువులు కూడా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. తమ ప్రవర్తనతో కుటుంబ గౌరవాన్ని, పాఠశాల ప్రతిష్టను కాపాడాలని కోరారు. విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు అలవరచుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని అన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల ఇందిర, ఉపసర్పంచ్ బీరేందర్ మ్యాక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. న్యాయ, పోలీస్ శాఖల అధికారులు విద్యార్థులకు అందించిన అవగాహన కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని పాఠశాల సిబ్బంది తెలిపారు.

అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- తెల్లవారుజామున పోతిరెడ్డిపల్లి మానేరు నుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు పట్టివేత

కరపత్రం ప్రతినిది, వీణవంక, సెప్టెంబర్ 19: కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు.వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లి మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మానేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలంలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.మానేరు పరివాహక ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలించే వాహనాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

ఆదివారం సెప్టెంబర్ 20,2026

దాడికి గురైన వేలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శ

» మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన..

» బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

కరపత్రం ప్రతినిధి /స్టేషన్ఘన్పూర్, సెప్టెంబర్ 19

ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఎంజీఎం ఆసుపత్రికి స్వయంగా చేరుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల బృందానికి సూచించారు. అనంతరం లక్ష్మణ్ నాయక్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో భౌతిక దాడులకు తావులేదని అన్నారు. రాజకీయాల్లో గానీ, శాంతిభద్రతల విషయంలో గానీ హింసాత్మక ఘటనలను సహించేది లేదని స్పష్టం చేశారు. లక్ష్మణ్ నాయక్‌పై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా గణపతి సహిత చండీ హోమం

▶ భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు.. అనంతరం మహా అన్నప్రసాద వితరణ

▶ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయి : కటంగూరి సత్యనారాయణ రెడ్డి

కరపత్రం ప్రతినిధిబ్యూరో, సెప్టెంబరు 19

శ్రీ రామకృష్ణ సేవా సమితి హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి సహిత చండీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన హోమ కార్యక్రమంతో ఉత్సవ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేద త్రిపుర పీఠం అర్చక బృందం పెద్దలు లోకే రాము మార్గదర్శనంలో గట్టు వినీల్ శర్మ, వేదాంతం రమేష్, శిష్ట్లా ప్రణీత్, రాజేశ్వర శాస్త్రి, దినేష్ శర్మ, లక్ష్మీ నరసింహ శర్మ, తుమ్మూరి రావు తదితర బ్రాహ్మణోత్తములు శాస్త్రోక్తంగా గణపతి సహిత చండీ హోమాన్ని నిర్వహించారు. హోమ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకక్షేమం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, సర్వజన శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా సమాజంలో ఐక్యత, భక్తిభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో దైవారాధనలో పాల్గొని ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని గణపతి, చండీమాతను ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భాగస్వామ్యం పెరుగుతోందని సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తులందరి సహకారంతో మరింత వైభవంగా నిర్వహించేందుకు సమితి తరఫున కృషి చేస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సమితి ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలో ఐక్యత, సేవాభావం, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చండీ హోమానికి కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి దంపతులు, క్రియాశీల కమిటీ సభ్యులు ప్రభు చైతన్య, నవీన్ రెడ్డి, సూర్య, కె.వి.రావు, మాతాజీలు సరోజనమ్మ, అనిత, లక్ష్మీదేవి, శిల్ప, అరుణ, యువ విభాగం కార్యకర్తలు రమేష్, శ్రీకాంత్, నరేష్, మంద సమ్మయ్యతో పాటు కాలనీవాసులు, భక్తులు సుమారు వంద మందికి పైగా పాల్గొన్నారు.

ప్రైవేట్ లెక్చరర్ల ఐక్యతకు సరికొత్త క్రీడా వేదిక

కరపత్రం ప్రతినిధివరంగల్, సెప్టెంబరు 19

వరంగల్--హనుమకొండ జంట జిల్లాల్లోని వివిధ ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రైవేట్ లెక్చరర్స్ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ ప్రైవేట్ లెక్చరర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. తెలంగాణలోనే తొలిసారిగా ప్రైవేట్ లెక్చరర్ల కోసం నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో వివిధ ప్రైవేట్ కళాశాలలకు చెందిన అధ్యాపకులతో కూడిన ఆరు జట్లు పాల్గొననున్నాయి.టోర్నమెంట్‌లో ఆరు జట్లను రెండు గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపులోని జట్లు పరస్పరం లీగ్ మ్యాచ్‌లు ఆడనున్నాయి. అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి దశ పోటీలు నిర్వహించనున్నారు. లక్ష్మణ్, అనిల్ కిషోర్, కె. మహేందర్, ఎం. వినోద్, మహేందర్, మందపురం సతీష్ ఆయా జట్లకు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. వీరే జేఏసీ కన్వీనర్లుగా టోర్నమెంట్ నిర్వహణలో కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రైవేట్ లెక్చరర్లు కళాశాలల్లో సుదీర్ఘ సమయం పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతల మధ్య అధ్యాపకులకు కొంత ఉల్లాసం, మానసిక ప్రశాంతత కల్పించడంతో పాటు ఆరోగ్యం, స్నేహబంధాలు, ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.కళాశాలలు, యాజమాన్యాలు వేరైనా విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే లెక్చరర్లంతా ఒక్కటేనని ఐక్యతా భావాన్ని ఈ క్రీడా వేదిక ప్రతిబింబించనుంది. మైదానంలో పోటీ ఉన్నప్పటికీ బయట స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగిస్తూ పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. వరంగల్-- హనుమకొండలో ప్రారంభమవుతున్న ఈ క్రీడా కార్యక్రమాన్ని భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, ప్రైవేట్ లెక్చరర్లను మరింతగా ఒకే వేదికపైకి తీసుకురావాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు వారు వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రైవేట్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు హాజరుకానున్నారు.

పెన్షనర్ల సేవకు గౌరవం.. నాంపల్లిలో ఆకట్టుకుంటున్న 'పెన్షనర్ వినాయకుడు'!

కరపత్రం ప్రతినిధిహైదరాబాద్, సెప్టెంబర్ 19

ఉద్యోగుల జీవితకాల సేవకు గౌరవం, పదవీ విరమణ అనంతరం పెన్షన్ ద్వారా లభించే ఆర్థిక భద్రత, ఆత్మగౌరవంతో కూడిన జీవనానికి ప్రతీకగా హైదరాబాద్‌లో కొలువుదీరిన 'పెన్షనర్ వినాయకుడు' అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. నాంపల్లిలోని పెన్షన్ పేమెంట్ ఆఫీస్ (పీపీఓ) ప్రాంగణంలో జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ వినూత్న వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు.ఆకట్టుకుంటున్న వినూత్న థీమ్: సంప్రదాయ భక్తి భావానికి ఆధునిక సామాజిక స్పృహను జోడిస్తూ నిర్వాహకులు ఈ థీమ్‌ను తీర్చిదిద్దారు. 'సేవ -- పదవీ విరమణ -- పెన్షన్ -- భద్రత -- గౌరవప్రదమైన జీవితం' అనే అర్థవంతమైన నినాదాన్ని ప్రతిబింబించేలా ఈ మండప అలంకరణ సాగింది. జీవితాంతం ప్రజా సేవలో తరించి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ నివాళిగా ఈ విగ్రహాన్ని, సెట్టింగ్‌ను రూపొందించారు.విఘ్నాలను తొలగించే గణనాథుడు ప్రతి పెన్షనర్‌కు ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, ఆర్థిక స్థిరత్వ ప్రసాదించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాక, సామాన్య భక్తులకు సైతం విశేషంగా నచ్చిన ఈ 'పెన్షనర్ వినాయకుడి'ని దర్శించుకునేందుకు నగరవాసులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

జీవో 97 పై సమగ్ర సమీక్ష పూర్తయ్యే వరకు ఎలాంటి చర్యలు వద్దు

● ఆ కమిటీకి టీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ నివేదిక

కరపత్రం ప్రతినిధిబ్యూరో, సెప్టెంబర్ 19

కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97 కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు, విద్యావ్యవస్థకు జరిగే నష్టాలపై అధ్యయనం కోసం తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించిన అధ్యయన కమిటీ తన రిపోర్ట్ ను కమిటీ చైర్మన్ కె. కేశవరావుకు అందజేసింది. దాదాపు పది రోజులు పాటు కమిటీ సభ్యులు ఈ అంశంపై అధ్యయనం చేసి నివేదిక తయారు చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు విద్యారంగ ప్రముఖులతో మాట్లాడి... ప్రభుత్వం ఇచ్చిన జీవో కారణంగా వచ్చే నష్టాలను నివేదికలో పొందుపరిచారు. ఈ అంశంపై సమగ్ర సమీక్ష పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతూ... కమిటీ తరపున పలు రికమండేషన్లు చేశారు.

ప్రభుత్వానికి కమిటీ చేసిన రికమండేషన్లు

ఈ జీవో పై సమగ్ర సమీక్ష పూర్తయ్యే వరకు తదుపరి చర్యలను నిలిపివేయాలి అప్పటివరకు ప్రస్తుతం ఉన్న సాంకేతిక విద్యా విధానం మరియు ఎస్ బి టి ఇ టి వ్యవస్థ పరిధిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలి ప్రస్తుతం ఉన్న డిప్లొమా అర్హతల గుర్తింపును, అలాగే ఈ సీ ఈ టి, లాటరల్ ఎంట్రీతో సహా ఉన్నత విద్య కోసం ఉన్న అన్ని మార్గాలను రక్షిస్తామని స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇవ్వాలి పాలిటెక్నిక్ విద్య సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. విద్యార్థుల ఫీజులను ఇష్టానుసారంగా పెంచొద్దు ప్రస్తుతం అమల్లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ఇచ్చే ప్రయోజనాలు యథాతథంగా కొనసాగించాలి పాలిటెక్నిక్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వారి క్యాడర్, ప్రమోషన్లు, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగ భద్రత ఇవ్వాలి (ప్రమోషన్లు) మరియు ఉద్యోగ భద్రతతో సహా పూర్తి సేవా రక్షణ కల్పించాలిపాలిటెక్నిక్ భూములు, భవనాలు, (లాబ్స్) తో సహా ఇతర ఆస్తులకు సంబంధించి చట్టపరమైన అనుమతులు లేకుండా వాణిజ్య, ప్రైవేట్ ప్రయోజనాల కోసం మళ్లించొద్దునివేదిక అందజేసిన వారిలో కమిటీ సభ్యులు నరేశ్ ప్రజాపతి, ధరణి రాణి, సురభి ఉన్నారు.. కమిటీ సభ్యులు వెంకటేశ్వర్ రావు, ఉదరి చంద్రమోహన్ గౌడ్, కోట్ల మహేందర్ రెడ్డితో కలిసి నివేదిక సమర్పించారు.

రాత్రివేళ వాహనాల బ్యాటరీల దొంగ అరెస్టు

రూ.లక్ష విలువైన 16 బ్యాటరీలు స్వాధీనం

కరపత్రం ప్రతినిధి హనుమకొండ, సెప్టెంబర్ 19

రాత్రివేళల్లో రోడ్ల పక్కన పార్క్ చేసిన ట్రాక్టర్లు, లారీల నుంచి బ్యాటరీలను చోరీ చేస్తున్న నిందితుడిని కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.1 లక్ష విలువైన 16 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాలసముద్రం ప్రాంతానికి చెందిన పస్తం అయిలు కుమార్ (35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు, ఇతర ఖర్చులకు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గతంలోనూ నిందితుడిపై పలు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 2012లో వరంగల్ బస్టాండ్‌లో సెల్‌ఫోన్ల చోరీ చేసిన ఘటనలో ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, గతంలో మొత్తం 36 దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కొంతకాలంగా రాత్రివేళల్లో ఆటోలో తిరుగుతూ జవహర్ కాలనీ, వడ్డేపల్లి, మిల్స్ కాలనీ, మడికొండ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ నిలిపి ఉంచిన ట్రాక్టర్లు, లారీలను లక్ష్యంగా చేసుకుని వాటి బ్యాటరీలను చోరీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలకు సంబంధించి కాకతీయ యూనివర్సిటీ, మడికొండ, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. పోలీసుల విచారణలో నిందితుడు ఐదు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతడి నుంచి ఐదు కేసులకు సంబంధించి రూ.1 లక్ష విలువైన 16 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. వరుసగా వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తూ పోలీసులకు సవాల్‌గా మారిన నిందితుడిని ప్రత్యేకంగా పరిగణించి కేసులను వేగంగా ఛేదించిన కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్, ఉప ఇన్‌స్పెక్టర్ కె. నవీన్‌కుమార్, నేర పరిశోధన సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖర్‌లను హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా ఐపీఎస్ అభినందించారు.

మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నవ కుంకుమలతో సహస్రనామార్చన

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కరపత్రం ప్రతినిధిబ్యూరో, సెప్టెంబర్ 19

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో నిర్వహించిన 'నవ కుంకుమలతో సహస్రనామార్చన' ఆధ్యాత్మిక కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఈటల రాజేందర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశ ప్రజల సంక్షేమం, దేశ ప్రగతి కోసం భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వేద మంత్రోచ్చారణలు, లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన పూజా కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక ప్రముఖులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, నవజీవన్ రెడ్డి, కొత్త రవీందర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, ఢిల్లీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.